

వ్యర్థాల తొలగింపు అనంతరం శుభ్రంగా మాదన్నపేట మార్కెట్

మాదన్నపేట మండీలో చెత్తకుప్పల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సైదాబాద్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మాదన్నపేట కూరగాయల మార్కెట్‌లో పేరుకుపోతున్న చెత్తకుప్పలు, దుర్గంధంగా పరిసరాలు, పట్టించుకోని అధికారులు పాలకవర్గం వంటి కథనాలు ఆంధ్రజ్యోతిలో వరుసగా ప్రచురితం కావడంతో ఎట్టకేలకు మార్కెటింగ్ అధికారులు స్పందించి చర్యలు చేపట్టారు. మార్కెట్ దయనీయ స్థితిపై కమిటీ వైస్‌చైర్మన్ కోట్ల శ్రీనివాస్ ఆంధ్రజ్యోతి కథనాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి సమస్యను వివరించారు. దీంతో స్పందించిన జీహెచ్ఎంసీ అధికారులు శనివారం రాత్రి మార్కెట్ ఆవరణలో యుద్ధప్రాతిపదికన చెత్తకుప్పలు తొలగించారు. దీంతో రైతులు, వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు, వినియోగదారులు హర్షం వ్యక్తం చేశారు.

ఉపాధి రంగాలను సద్వినియోగం చేసుకోవాలి



శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న సామ రంగారెడ్డి, చింతల అరుణాసురేందర్‌యాదవ్

మన్సూరాబాద్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): తమ పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఉపాధి రంగాలను సద్వినియోగం చేసుకుని కుటుంబానికి తమవంతుగా ఆర్థిక భరోసానివ్వాలని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణాసురేందర్‌యాదవ్ పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని శ్రీఇంద్రప్రస్థకాలనీలో హ్యూమానిటీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ఫర్ ఉమెన్ కార్యక్రమంలో భాగంగా ఉచితంగా కుట్టు శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లను ఆదివారం వారు ముఖ్యఅతిథులుగా విచ్చేసి అందజేశారు. అనంతరం లక్కీ డ్రా ద్వారా గెలుపొందిన పలువురు మహిళలకు కుట్టు మెషిన్లను అందజేశారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేందర్‌యాదవ్, కె.లయ, వరకుమార్, నీరజ, కాశీనాథం, కె.హరిబాబు, గోపాల్ పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ ప్రారంభం



కమ్యూనిటీహాల్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సుజాతానాయక్

చంపాపేట, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్‌లోని సాయిగణేష్‌నగర్‌కాలనీలో జీహెచ్ఎంసీ నిధులతో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను కార్పొరేటర్ సుజాతానాయక్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు. కాలనీలో రూ.1.50కోట్లతో ట్రంక్‌లైన్, సీసీ కెమెరాలు, రహదారి నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు కార్పొరేటర్ తెలిపారు. కాలనీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రాజ్, ప్రధాన కార్యదర్శి నర్సింహరాజ్, కాలనీ ప్రతినిధులు విజయ్, కరుణాకర్, ఆసీఫ్, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

అభివృద్ధి పనులు ప్రారంభం

హయత్‌నగర్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ పరిసర ప్రాంతాల్లోని పవనగిరికాలనీ, ఎల్లారెడ్డికాలనీల్లో రూ.47లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ఆదివారం కాలనీ సంక్షేమ సంఘం నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మాణంతో కేవీఎన్‌రెడ్డి పరిసర కాలనీల్లో వెళ్లేందుకు రోడ్డు మార్గం సులువు అయిందన్నారు. రోడ్డు నంబర్ 11తో పాటు మిగిలిన రోడ్లను కూడా పూర్తిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు కాలనీవాసులు పాల్గొన్నారు.

కృష్ణానగర్ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం

సైదాబాద్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ఐఎస్‌సదన్ డివిజన్‌లోని కృష్ణానగర్ సంక్షేమ సంఘం ఫేజ్-1 నూతన కార్యవర్గం ఆదివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నికైంది. నూతన అధ్యక్షుడిగా జైపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా సునీల్, కార్యదర్శిగా గోల్డ్ శ్రీను, సంయుక్త కార్యదర్శిగా యూనస్, కోశాధికారిగా నర్సింహారెడ్డి ఎన్నికయ్యారు.

చైతన్యనగర్‌కాలనీ సంక్షేమ సంఘం..

చంపాపేట, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్ చైతన్యనగర్ కాలనీ(రోషన్‌దౌలా) సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా జి.విజయ్ కుమార్, ఉపాధ్యక్షుడిగా కె.ముత్యంరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కె.రాజేందర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా ఎన్.విజయ్, కోశాధికారిగా ఆర్.శంకర్‌గౌడ్, కార్యవర్గ సభ్యులుగా కె శాంబుగౌడ్, కె.అశోక్‌విజయన్, కె.సతీష్‌కుమార్, ఆర్.సుధాకర్ రెడ్డి, ఆర్. ప్రమోద్‌సింగ్, డి.శ్రీకాంత్‌రెడ్డి ఎన్నికయ్యారు.

జడ్జెస్‌కాలనీ సంక్షేమ సంఘం..

మన్సూరాబాద్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ జడ్జెస్‌కాలనీ నూతన కార్యవర్గాన్ని కాలనీ సంక్షేమ సంఘం భవనం ఏర్పాటు చేసిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా వి.చంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎం.జనార్దన్‌రావు, కోశాధికారిగా వై.కలివర్ధన్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడిగా ఆర్.చంద్రకాంత్‌రెడ్డి, ప్రధాన సలహాదారుడిగా టంగుటూరి నాగరాజు, ఉపాధ్యక్షులుగా ఆర్.రమేష్‌రావు, ఎస్.యాదగిరేందర్, సంయుక్తకార్యదర్శులుగా పి.రవికుమార్‌రెడ్డి, ఎస్.బాలాజీ యాదవ్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా సీహెచ్ ప్రవీణ్‌కుమా ర్, ఎన్.శ్రీనివాస్‌రెడ్డి, కె.మహేష్, కార్యవర్గ సభ్యులుగా బి.యాదగిరిగౌడ్, కె. జంగారెడ్డి, గ్యామానాయక్, అనిల్‌రెడ్డి, మధుసూదన్‌రావు ఎన్నికయ్యారు.

బైకును ఢీకొన్న ట్రాన్స్‌పోర్టు వాహనం : మహిళ మృతి

హయత్‌నగర్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): వేగంగా వెళ్తున్న నవత ట్రాన్స్‌పోర్టు వాహనం బైకును ఢీకొట్టిన సంఘటనలో మహిళ అక్కడికక్కడే మృతిచెందగా బైకు పైన ఉన్న అల్లుడు, కూతురు, మనుమరాలుకు స్వల్ప గాయాలైన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. కాటెదాన్ టీఎన్‌జీవోఎస్ కాలనీకి చెందిన పోతులగడ్డ నాగమ్మ(45) ఆదివారం సాయంత్రం అల్లుడి బైకు మీద హయత్‌నగర్ నుంచి ఎల్బీనగర్ వైపుకు వెళ్తున్నారు. బైకు మీద అత్త నాగమ్మతో పాటు కుతురు, మనుమరాలు కూర్చున్నారు. హయత్‌నగర్ సాయిబాబా ఆలయం వద్దకు రాగానే వెనుక నుంచి వేగంగా వస్తున్న నవత ట్రాన్స్‌పోర్టుకు చెందిన వాహనం ఢీకొట్టింది. దీంతో అత్త నాగమ్మ కింద పడగానే వాహనం మీదినుంచి వెళ్లింది. దీంతో నాగమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. అల్లుడు, కూతురు, మనుమరాలకు స్వల్పగాయాలు అయ్యాయి. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. బాధితుల పూర్తి వివరాలు అందలేదని పోలీసులు తెలిపారు.

సర్వేల్లో సిబ్బంది.. పన్ను వసూళ్లకు ఇబ్బంది

- మలక్‌పేట సర్కిల్ టార్గెట్ రూ.144కోట్లు
- ఇప్పటివరకు వచ్చింది రూ.23.68 కోట్లు మాత్రమే



జీహెచ్ఎంసీ మలక్‌పేట సర్కిల్ కార్యాలయం

ఓల్డ్‌మలక్‌పేట, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మలక్‌పేట సర్కిల్ 6 పరిధిలో ఇంటిపన్ను వసూళ్లు కుంటుపడ్డాయి. సర్కిల్‌లో ఈ సంవత్సరం నిర్దేశించిన ఆదాయం టార్గెట్ చేరుకునేది కష్టతరంగానే ఉంది. మరో రెండు నెలల్లో వార్షిక సంవత్సరం ముగియనుండగా ఇచ్చిన టార్గెట్‌లో కనీసం సగం వంతు కూడా వసూలు కాలేదు. సర్కిల్ పరిధిలో ఈ సంవత్సరం రూ.144 కోట్ల వసూలు చేయాల్సి ఉండగా, జనవరి 15 వరకు కేవలం రూ.23కోట్ల 68 లక్షలు మాత్రమే వసూలయ్యాయి. గత సంవత్సరం 30 కోట్ల ఆదాయం వచ్చింది. సర్కిల్ పరిధిలో ఏడు డివిజన్‌లు ఉన్నాయి. 50,121 నివాస గృహాలు, 6,981 కమర్షియల్ బిల్డింగ్‌లు, మిక్సిడ్ ప్రాపర్టీస్ 571, మొత్తం కలిపి 57,673 భవనాలు ఉన్నాయి. సర్కిల్ పరిధిలో 11మంది బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, ఇద్దరు అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్లు ఉన్నారు.

సర్వేలతోనే సరిపోతోంది..

జీహెచ్ఎంసీ సిబ్బందికి ప్రభుత్వ సర్వేలతోనే సరిపోతుంది. డిపార్ట్‌మెంట్ పనులు కుంటుబడిపోతున్నాయి. దీంతో రావాల్సిన ఆదాయం వసూలు కావడంలేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాల సర్వేలకు క్షేత్రస్థాయిలో జీహెచ్ఎంసీ సిబ్బందిని వాడుకుంటున్నారు. తద్వారా ఇంటి పన్ను వసూలు ఇతరతర వాటిపై ప్రభావం పడుతుంది. ప్రభుత్వం సర్వేల మీద సర్వేలు చేయిస్తుంది. అన్ని సర్వేలకు జీహెచ్ఎంసీ సిబ్బందే ప్రధానపాత్ర. ప్రజాపాలన, ఇంటింటా కులగణన సర్వే, డిజిటల్ నెంబర్లసర్వే, ఎన్నికల పనులు, ఇలా ప్రతి వాటికి జీహెచ్ఎంసీ సిబ్బందినే వాడేస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తికాక ముందే రేషన్‌కార్డుల సర్వే మొదలుపెట్టారు. దీంతో ఏ సర్వే పూర్తిచేయాలో అర్థంకాక అధికారులు, సిబ్బంది తలలు పీకుంటున్నారు. మరోవైపు డిపార్ట్‌మెంట్ పనులు ట్యాక్స్ వసూలు చేయడం ట్రేడ్ లైసెన్సు వసూలుతో పాటు కార్యాలయ పనులు చూసుకుంటూ మరోవైపు ఇందిరమ్మ ఇళ్లసర్వే చేస్తున్నారు. రెగ్యులర్ పనులకే సమయం సరిపోవడంలేదని అదనంగా పలు సర్వేలు అంటగట్టడం వల్ల సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్వేలు ఇతర డిపార్ట్‌మెంట్లకు అప్పచెప్పాలని ప్రభుత్వ ఉన్నతాధికారులను కోరుతున్నారు. ఒకవైపు రెగ్యులర్ పనులు చూస్తూనే మరొకవైపు సర్వేలు చేస్తున్నారు. తద్వారా జీహెచ్ఎంసీ పనులు కుంటుపడుతున్నాయి. ట్యాక్స్‌లు వసూలు కావడంలేదు. రెగ్యులర్ పనులపై తీవ్రప్రభావం పడుతుంది. నిర్దేశించిన మేర ట్యాక్స్ వసూలు కావడంలేదు. సర్కిల్ 6 పరిధిలో ప్రతిరోజు సుమారు రూ.10లక్షల ట్యాక్స్ వసూలయ్యేది సర్వే వల్ల సిబ్బంది రెగ్యులర్ పనులపై దృష్టి సారించకపోవడం వల్ల రోజుకు రెండు లక్షలు కూడా పన్ను వసూలు కావడం లేదని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు.

పన్ను వసూలుపై దృష్టి సారిస్తాం



ఇంటి పన్ను వసూలుపై దృష్టి సారిస్తాం. నిర్దేశించిన టార్గెట్ చేరుకునేందుకు స్పెషల్ డ్రైవ్‌లు చేపడతాం. సర్కిల్ పరిధిలో మొండి బకాయి దారులకు నోటీసులు ఇచ్చాం. త్వరలోనే వారిపై చర్యలు తీసుకుంటాం. ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలి.

\- జయంత్, ఉప కమిషనర్, జీహెచ్ఎంసీ మలక్‌పేట సర్కిల్

బొమ్మలు తీర్చిదిద్దినట్టే జీవితాలనూ తీర్చిదిద్దుకోండి

- విశ్వబ్రాహ్మణులకు ఎమ్మెల్యే సబితారెడ్డి సూచన



విశ్వబ్రాహ్మణ సంఘం వార్షికోత్సవంలో ఎమ్మెల్యే సబితారెడ్డి, మాజీ మేయర్

సరూర్‌నగర్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): బొమ్మలు, విగ్రహాలను కళాత్మకంగా తీర్చిదిద్దినట్టే విశ్వబ్రాహ్మణులు తమ జీవితాలను సై తం తీర్చిదిద్దుకోవాలని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి సూచించారు. తమ కుటుంబాల్లోని పిల్లల భవిష్యత్‌ను కూడా అదే తరహాలో తీర్చిదిద్దాలని ఆమె అన్నారు. ఆదివారం నాదర్‌గుల్‌లోని తోట యెట్టారెడ్డి గార్డెన్స్‌లో జరిగిన విశ్వబ్రాహ్మణ సంఘం నాదర్‌గుల్ శాఖ ఆరో వార్షికోత్సవంలో బడంగ్‌పేట్ మాజీ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డితో కలిసి ఆమె పాల్గొన్నారు. సబితారెడ్డి మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణుల కళ వెలకట్టలేనిదని, వారి చేతుల్లో రూపుదిద్దుకున్న అనేక కళాఖండాలు అబ్బురపరుస్తాయని అన్నారు. మేయర్ పారిజాతారెడ్డి మాట్లాడుతూ విశ్వకర్మల సమస్యలను జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానని అన్నారు.

విశ్వకర్మ యోజనను సద్వినియోగం చేసుకోవాలి: అందెల

కేంద్రం విశ్వకర్మల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని విశ్వకర్మ యోజన పథకాన్ని ప్రవేశపెట్టిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ అన్నారు. నాదర్‌గుల్ విశ్వకర్మ సంఘం వార్షికోత్సవంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో భాగ్యనగర్ రైతు సొసైటీ చైర్మన్ మర్రి నర్సింహారెడ్డి, మాజీ కౌన్సిలర్లు మంజులాకుమార్‌గౌడ్, మమతాసుదర్శన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ హన్మంత్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు శ్రీధర్‌రెడ్డి, సునీతాశ్రీకాంత్‌గౌడ్, ఇంద్రసేన, భిక్షపతిచారి, విశ్వకర్మ సంఘం ప్రతినిధులు వేములకొండ జంగాచారి, జి.రాజుచారి, ప్రశాంత్‌కుమార్‌చారి, నరేశ్‌చారి, వెంకటాచారి, సురేశ్‌చారి, శ్రీనివాస్‌చారి, బ్రహ్మచారి, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మహాప్రదర్శనకు ప్రతి మాదిగా డప్పుతో కదలాలి

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ



లక్షడప్పులు వేయిగొంతులు మహా ప్రదర్శన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

ఎల్బీనగర్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మహాప్రదర్శనకు ప్రతి మాదిగ సంకన డప్పుతో కదలాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 7న నిర్వహించనున్న లక్ష డప్పులు వేయిగొంతులు మహాప్రదర్శన పోస్టర్‌ను ఆదివారం సాయంత్రం సరూర్‌నగర్ జూనియర్ కళాశాల మైదానంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్లను ఏబీసీడీలుగా వర్గీకరించాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ అమలు చేయడంలో జాప్యం చేస్తున్నారన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని కోరుతూ ఫిబ్రవరి 7న నగరంలో తలపెట్టిన లక్షడప్పులు వేయిగొంతులు మహాప్రదర్శనకు కదం తొక్కాలని ఆయన పిలుపునిచ్చారు. ఉమ్మడి రిజర్వేషన్ ఫలాలను ఒక సామాజిక వర్గం వారే లబ్ధిపొందుతూ వచ్చారన్నారు. ఈ రిజర్వేషన్లు మాల, మాదిగల పంచాయతీ కాదని 59 ఉపకులాలకు సంబంధించిందన్నారు. సుప్రీంకోర్టులో ఆరుగురు న్యాయమూర్తులు తీర్పు ఇచ్చారని ఈ తీర్పు అమలును మాల సామాజికవర్గం వారు అడ్డుకోవడం మంచిదికాదన్నారు. ఆరు నూరైనా వర్గీకరణ జరిగి తీరుతుందన్నారు. ప్రతి మాదిగ బిడ్డ డప్పును పట్టుకుని నగరానికి తరలిరావాలన్నారు. కార్యక్రమంలో మాదిగ సాంస్కృతిక శాఖ కళామండలి అధ్యక్షుడు పల్లెపాక కుమార్, శ్రావణ్‌కుమార్, ఎల్లయ్య, మాదిగ డప్పు కళాకారులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మపై శంకరనారాయణ పాట ఆవిష్కరణ



ఆడియో సీడీని ఆవిష్కరిస్తున్న జనార్దనమూర్తి, శంకరనారాయణ

చిక్కడపల్లి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): హాస్యబ్రహ్మగా ప్రసిద్ధి పొందిన ప్రముఖ పాత్రికేయుడు శంకరనారాయణ కనకదుర్గమ్మపై విశేషమైన భక్తితో వీనుల విందయిన చక్కటి పాటను రాశారని త్యాగరాయ గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అన్నారు. ఇదే కాకుండా శంకర నారాయణ అనేకమంది దేవుళ్ల మీద 35 శతకాలు రాశారన్నారు. శంకర నారాయణ కనకదుర్గమ్మ మీద రాసిన పాట ఆడియో సీడీని త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. జనార్దనమూర్తి మాట్లాడుతూ, ఈ పాటకు పాటల రచయిత, స్వరకర్త రాయారావు విశ్వేశ్వర్‌రావు స్వర కల్పన చేసి అద్భుతంగా గానం చేశారని అభినందించారు. శంకరనారాయణ మాట్లాడుతూ, కనకదుర్గమ్మ అంటే తనకు ప్రత్యేకమైన భక్తి ప్రపత్తులున్నాయన్నారు. పాటను మనస్సుకు హత్తుకునేలా రాయారావు విశ్వేశ్వర్‌రావు స్వరపరచిభక్తి పరవశం పొందేట్లు గానం చేశారన్నారు. ఇందుకు దోర్బల లిఖిత్ మంచి సంగీతం అందించారన్నారు. కార్యక్రమంలో గుండవరపు గీతాదేవి, పేరి అన్నపూర్ణ, శ్రీరామ్ పాల్గొన్నారు.

దేశగతిని మార్చే అద్భుతమైన బడ్జెట్ : బీబీఆర్ వేణు



మాట్లాడుతున్న బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బీబీఆర్ వేణు, రాములు, కిరణ్ తదితరులు

ఎల్బీనగర్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): లోక్‌సభలో ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశ గతినే మార్చే విధంగా అద్భుతంగా ఉన్నదని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బీబీఆర్ వేణు కొనియాడారు. ఆదివారం ఆర్‌కేపురం బీజేపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇది పేద, మధ్య తరగతి, యువత, రైతు సంక్షేమ బడ్జెట్ అని పేర్కొన్నారు. వేతనజీవులకు రూ. 12లక్షల వరకు పన్ను మినహాయింపు ఇవ్వాలని తీసుకున్న నిర్ణయం విప్లవాత్మకమన్నారు. పన్ను మినహాయింపుతో తెలంగాణ సహా దేశంలోని ఒక్కో ఉద్యోగికి రూ. 85 వేల వరకు ఆదా అవుతుందన్నారు. రాష్ట్రంలో 50లక్షల మందికి పైగా రైతులకు లక్ష వరకు రుణం పొందే అవకాశం ఉందన్నారు. రైతులంతా కిసాన్ క్రెడిట్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సమావేశంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కోకన్వీనర్ రాగుల కిరణ్‌కుమార్‌గౌడ్, ఆర్‌కేపురం డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ముంత రాములు యాదవ్, ఓబీసీ నాయకులు రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.

హైడ్రా కూల్చివేతల నేపథ్యంలో బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదు

- సత్యానగర్ జనప్రియ ఎన్‌క్లేవ్ వాసులు



మాట్లాడుతున్న జనప్రియ ఎన్‌క్లేవ్ ప్రధాన కార్యదర్శి కృష్ణకిషోర్

కొత్తపేట, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మూసీ పరీవాహక ప్రాంతాల్లో, పరిసరాల్లో హైడ్రా సర్వేలు, కూల్చివేతల నేపథ్యంలో బ్యాంకులు రుణాలు ఇవ్వడానికి నిరాకరిస్తుండడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఎల్బీనగర్ కొత్తపేట డివిజన్ సత్యానగర్‌కాలనీలోని జనప్రియ ఎన్‌క్లేవ్‌వాసులు వాపోతున్నారు. ఆదివారం జనప్రియ ఎన్‌క్లేవ్ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కృష్ణకిషోర్, కార్యవర్గసభ్యులు, ప్రతినిధులు విలేకరులతో మాట్లాడారు. తమకు హైడ్రా నుంచి ఎలాంటి నోటీసులు అందలేదని తమ పిల్లల చదువులకు, ఇతర అవసరాలకూ రుణాలు ఇవ్వాలని బ్యాంకులను అభ్యర్థించామని తెలిపారు. నూతనంగా వారికి రుణాలు ఇవ్వడం కుదరదని బ్యాంకు అధికారులు జవాబిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో 6 నెలలుగా ఇక్కడ 280ఫ్లాట్లలో నివసిస్తున్న మధ్య తరగతి, దిగువ మధ్య తరగతికి చెందిన సుమారు 1500మంది తీవ్ర మానసిక, ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని వారు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి లేదా హైడ్రా అధికారుల నుంచి సత్యానగర్ జనప్రియ ఎన్‌క్లేవ్ వాసులకు రుణాలు ఇవ్వరాదని లేదా సదరు అపార్టుమెంట్ల సముదాయాలు మూసీ బఫర్ జోన్‌లో ఉన్నాయని కానీ కూల్చివేసే ఇళ్ల జాబితాలో ఉన్నాయని అధికారికంగా సమాచార పత్రాలు ఇచ్చారా అని అడిగితే అలాంటి పత్రాలు ఏవీ అందలేదని బ్యాంకు అధికారులు చెబుతున్నారని అపార్టుమెంట్లలో ఉండే వారు తెలిపారు. 2002లో రెండు ఎకరాల 5 గుంటల స్థలంలో జనప్రియ ఎన్‌క్లేవ్ 5బ్లాకులు నిర్మించారన్నారు. అన్నీ రిజిస్టర్డ్ ఫ్లాట్లనీ అయినా తమ ఫ్లాట్లపై బ్యాంకులు రుణాలు ఆపేయడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, హైడ్రా అధికారులు, ప్రజాప్రతినిధులు తమను ఆర్థికంగా ఆదుకునేందుకు తగిన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో కార్యవర్గ సభ్యులు సుగుణ, రఘునందన్, ప్రభాకర్, ఆల్బర్ట్, సత్యనారాయణ, ఆదర్శ్ పాల్గొన్నారు.



నిరసన ప్రదర్శనలో పాల్గొన్న పీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణపై వివక్ష : దేప భాస్కర్‌రెడ్డి

ఎల్బీనగర్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు తీరని అన్యాయం చేసిందని పీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి విమర్శించారు. తెలంగాణ పట్ల కేంద్రం వివక్షకు నిరసనగా టీపీసీసీ ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టిన నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు మహేశ్వరం నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం నుంచి ఎనిమిది మంది ఎంపీలను గెలిపించినప్పటికీ రాష్ట్రానికి ఒక్క రూపాయి కూడా తేలేని స్థితిలో ఉన్నారన్నారు. కేంద్ర మంత్రివర్గంలో రాష్ట్రానికి చెందిన ఇద్దరు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ బడ్జెట్‌లో కనీస కేటాయింపులు కూడా లేకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ నందిగామ నర్సింహ, వెంకటేష్‌గౌడ్, రాజునాయక్, మన్న రవి, లాజర్, చేవంగి ప్రవీణ్, యూసుఫ్ ఖాద్రీ, శ్రీధర్, శివ, వంశిరెడ్డి పాల్గొన్నారు.



కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేస్తున్న ఎల్బీనగర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివకుమార్ తదితరులు

బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం : శివకుమార్

మన్సూరాబాద్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం శనివారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి ఎలాంటి కేటాయింపులూ లేకుండా తీవ్ర అన్యాయం చేశారని ఎల్బీనగర్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు నిరసనగా ఆదివారం ఎల్బీనగర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నడూ లేనట్లుగా 8మంది ఎంపీలను గెలిపించి ఇచ్చిన తెలంగాణకు బడ్జెట్‌లో చోటు కల్పించకుండా బీజేపీ ప్రభుత్వం ద్రోహం చేసిందన్నారు. ఈ నిరసనలో ఎల్బీనగర్ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సాయిరాంరెడ్డి, ప్రధాన కార్యదర్శులు దాడి రుత్విక్, దాసు మనోజ్‌కుమార్, పలు డివిజన్ల అధ్యక్షులు అనిల్‌కుమార్, నేలపాటి రాజేష్, రమణారెడ్డి, పరమేష్‌యాదవ్, ఉపాధ్యక్షులు శివ, తిరుపతి పాల్గొన్నారు.



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025-2026 బడ్జెట్ ప్రతులను తుర్కయంజాల్ చౌరస్తాలో దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

బడ్జెట్ ప్రతులు దహనం

హయత్‌నగర్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025-2026 బడ్జెట్ ప్రతులను ఆదివారం తుర్కయంజాల్ చౌరస్తాలో సీపీఎం నాయకులు దహనం చేశారు. బడ్జెట్ పూర్తిగా సంపన్న వర్గాలు, కార్పొరేట్ సంస్థలకు, పెట్టుబడిదారులకు ఉపయోగపడేలా ఉందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు డి. కిషన్ ఆరోపించారు. తుర్కయంజాల్ చౌరస్తాలో నాగార్జునసాగర్ రహదారిపైన అంబేడ్కర్ విగ్రహం ముందు నిరసన వ్యక్తం చేసి బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. అనంతరం కిషన్ మాట్లాడుతూ బడ్జెట్ కేవలం బీజేపీ పాలిత రాష్ట్రాలకు మాత్రమే ఉపయోగపడేలా ఉందన్నారు. దేశ అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న కార్మికవర్గాల గురించి, వ్యవసాయ కూలీలు, రైతుల గురించి పట్టించుకోలేదని అన్నారు. విద్యా, వైద్య రంగాలను పూర్తిగా నిర్లక్ష్యం చేసి నిరుద్యోగ యువతకు మొండి చెయ్యి చూపారని అన్నారు. తెలంగాణ, కేరళ రాష్ట్రాలను పూర్తిగా విస్మరించారని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సత్యనారాయణ, ఆశీర్వాదం, శారద, శంకరయ్య, శ్రీనివాసులు, కృష్ణ, మద్దెల యాదయ్య మాధవరెడ్డి, మధు, శేఖర్‌రెడ్డి, బాల్‌రాజ్, బీరప్ప, జాఫర్, మధుకర్‌రెడ్డి, యాదగిరి, యాదిరెడ్డి, కృష్ణకుమార్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి : ఇన్‌స్పెక్టర్

వనస్థలిపురం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. జేసీఐ (జూనియర్ చాంబర్స్ ఇంటర్నేషనల్) వారి ఆధ్వర్యంలో హైదరాబాద్ ఫీనిక్స్ కార్యక్రమంలో భాగంగా వనస్థలిపురంలోని వాసవీ ఆలయంలోని ఫంక్షన్ హాలులో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ తెలియని నంబర్లు, వెబ్‌సైట్ల ద్వారా ఫోన్లు, మెసేజ్‌లు వస్తే జాగ్రత్త వహించాలని, ఎలాంటి అనుమానం ఉన్నా 1930 హెల్ప్‌లైన్‌కి డయల్ చేయాలని సూచించారు. జేసీఐ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా సెల్ఫ్ డెవలప్‌మెంట్, డిసిప్లేయిన్ కమ్యూనికేషన్, ఆర్గనైజింగ్, మేనేజ్‌మెంట్, బిజినెస్ స్కిల్స్‌పై అవగాహన కల్పిస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని జేసీఐ అధ్యక్షులు సువిధ సూచించారు. వివరాలకు 8686458899 నంబర్‌లో తమను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ ఏడుకొండలు, భాస్కర్, నీరజ్, నందకిశోర్, భావన శ్రీనివాస్ పాల్గొన్నారు.